



విలేకరులతో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్

ఈ సారైనా ఇస్తారా..?



- జిల్లా ప్రాజెక్టులకు దక్కని నిధులు
- ముందుకు కదలని పథకాలు
- ఈ బడ్జెట్‌పై జిల్లా వాసుల ఆశలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు కదలడం లేదు. గత కొన్నేళ్లుగా రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోవడంతో ఏ ప్రాజెక్టూ ముందుకు సాగడం లేదు. చాలా ప్రాజెక్టులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. శుక్రవారం అసెంబ్లీలో రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఈ సారైనా జిల్లా ప్రాజెక్టులకు నిధులు ఇస్తారా..? లేదా..? అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు....

గతేడాది రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. రాయలసీమకు ఆధారంగా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధికి ఎటువంటి కేటాయింపులూ చేయలేదు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల అంచనాలను పక్కనబెట్టి మొక్కుబడిగా నిధులు కేటాయించారు.

గతి లేని గుండ్రేవుల

కర్నూలు, కడప జిల్లాలకు మేలు కలిగిలే రూపొందించిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలేవీ ఇప్పటి వరకూ మొదలు కాలేదు. కర్నూలు జిల్లా సుంకేసుల దగ్గర తుంగభద్ర నదిపై 1.20 టిఎంసిల సామర్థ్యంతో 1865లో అప్పటి పాలకులు సుంకేసుల జలాశయాన్ని నిర్మించారు. ఈ బ్యారేజీకి అనుసంధానంగా కర్నూలు-కడప (కెసి) కాలువ నిర్మించారు. జల రవాణా కోసం నిర్మించిన కాలువను స్వాతంత్ర్యం అనంతరం సాగునీటి కాలువగా మార్చారు. కృష్ణా వాటర్ డిస్‌ప్యూట్ ట్రిబ్యునల్ 31.90 టిఎంసిల నీటి వాటాను కేటాయించింది. దీని పరిధిలో కర్నూలు, కడప జిల్లాలో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. సుంకేసుల సామర్థ్యం తక్కువ కావడంతో తుంగభద్రకు వరద వస్తేనే కాలువకు సాగునీరు అందుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజినీర్ సుబ్బరాయుడు సుంకేసుల రిజర్వాయర్ ఎగువన గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూపకల్పన చేశారు. కర్నూలు జిల్లాలోని సి.బెళగల్, నందవరం, తెలంగాణలోని రాజోలు ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం జరిగితే 20 టిఎంసిలు నిల్వ చేయనున్నారు. వరద లేని సమయంలోనూ ఈ నీటిని వాడుకోవచ్చు. గుండ్రేవులకు సంబంధించి గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రవేశపెట్టిన నాలుగు బడ్జెట్లలోనూ గుండ్రేవులకు నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజల ఆశలు అడియాశలయ్యాయి.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరువుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హోసళ్లి, సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి. పథకం ప్రారంభంలో వేసిన గొట్టాలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎత్తిపోతల కింద 500 నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులకు నిధులు వెచ్చించి పునరుద్ధరిస్తే తామే వాటిని కొనసాగించుకుంటామని రైతులు వేడుకుంటున్నా పట్టించుకొనేవారు కరువయ్యారు.

వలస నివారణ చర్యలు శూన్యం

ఏళ్ల గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊళ్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేత పట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హొళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబయికి తరలివెళ్లారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 40వేల మందికి పైగా వలస వెళ్లారు. వలస నివారణకు చర్యలు చేపట్టే అంశాన్ని ఇప్పటి వరకూ ఏ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

విద్యతోనే సమానత్వం

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యతోనే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గురువారం కర్నూల్ నగరంలోని ఉస్మానియా కాలేజ్ రోడ్డులో ఉన్న ఉమర్ అరబిక్ పాఠశాల ప్రాంగణాన్ని చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూర్వకాలంలో పెద్దలు ముందుగానే ఆలోచించి కేవలం చదువు మాత్రమే సమాజంలో సమానత్వం తీసుకు రాగలదని భావించి 102 సంవత్సరాల కిందటే ఉమర్ అరబిక్ పాఠశాలను తీసుకొచ్చారన్నారు. చదువును ఉచితంగా ఇస్తే సమాజం బాగుపడు తుందన్నారు. మహానుభావులు డాక్టర్ అబ్దుల్ హక్ అంజునన్-ఇ-ఇస్లామియా ఆర్గనైజేషన్‌ను స్థాపించారన్నారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా ఎలిమెంటరీ స్కూల్, హైస్కూల్, యునాని కాలేజ్‌లు నడుస్తున్నాయని తెలిపారు. విద్యారంగంలో గణనీయంగా సాంకేతిక మార్పులు వస్తున్నాయని, అనుగుణంగా మనం కూడా మార్పు చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విద్యాసంస్థ వక్ఫ్ బోర్డు డైరెక్ట్ మేనేజ్మెంట్‌లో ఉన్నపటికీ స్కూల్‌ను మేనేజ్ చేయడం, చదివిపించడం అనేది మాత్రం అంజునన్-ఇ-ఇస్లామియా ఆర్గనైజేషన్ చేస్తుందన్నారు. ఈ పాఠశాల ఎయిడెడ్‌గా ఉండే సందర్భంలో పేద పిల్లలకు ఉచిత విద్యతో పాటు, భోజనం, డ్రస్‌లు, పుస్తకాలు ప్రభుత్వం ఇచ్చేదన్నారు. కానీ గత ప్రభుత్వం నాన్ ఎయిడెడ్‌గా చేసినందున పాఠశాలలో చదివే విద్యార్థులకు వచ్చే మిడ్ డే మీల్స్, ఉచిత పుస్తకాలు, స్కూల్ డ్రస్‌లు నిలిచిపోయాయని తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులను సైతం ప్రభుత్వానికి సరెండర్ చేశారన్నారు. ఇక్కడ విద్యార్థులు ఉర్దూ, పర్షియన్ భాషలను ఏ విధంగా చదువుతున్నారో దానితో పాటు ఇంగ్లీష్ మీడియం కూడా తేవడానికి ప్రయత్నం చేస్తామన్నారు. గతంలో ఈ పాఠశాలలో 1000 విద్యార్థులు చదివేవారని,ప్రస్తుతం 250 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని చెప్పారు. ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేయాలని స్కూల్ కమిటీ కోరిందని, వక్ఫ్‌బోర్డ్, ప్రభుత్వ సహకారంతో ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేయబోతున్నా మన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సబీహా పర్వీన్, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, అంజుమన్-ఇ-ఇస్లామియా ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- మార్చి 1వ తేదీ నుండి 20వ తేదీ వరకు పరీక్షలు
- ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మార్చి 1వ తేది నుండి 20వ తేది వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి వెల్లడించారు. గురువారం కర్నూల్ నగరంలోని ఆర్ఐఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1వ తేది నుండి 20వ తేది వరకు 69 పరీక్షా కేంద్రాల్లో జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 45,325 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. మొదటి సంవత్సరం 23,098 మంది, రెండవ సంవత్సరం 22227 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 7 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. విద్యార్థులందరూ హాల్ టికెట్లు నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మూడు రూట్లలో బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, ఆరు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పరీక్షల స్పెషల్ ఆఫీసర్ లాలప్ప, డిఈసి సభ్యులు నాగభూషణ్ రెడ్డి, పద్మావతి, సురేష్ చంద్ర, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి

దర్జీలకు ఆదరణ కరువు

- రెడీమేడ్ దుస్తులతో ఉపాధి కరువు
- రుణాలు ఇచ్చి ఆదుకోవాలని వేడుకోలు
- నేడు ప్రపంచ దర్జీ కళా దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మనిషి అందంగా కనిపించేందుకు వేసుకునే దుస్తులను రూపొందించే దర్జీలకు నేడు ఆదరణ లేకుండా పోయింది. ఎక్కువగా రెడీమేడ్ దుస్తుల వాడకంతో దర్జీలకు ఉపాధి కరువైంది. ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆదుకోవాలని టైలర్లు వేడుకుంటున్నారు. నేడు ప్రపంచ దర్జీ కళా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

అమెరికాలో 1819లో జన్మించిన విలియం హెూ అతి చిన్న వయసులోనే 1845లో కుట్టు మిషన్ రూపొందించి ఫిబ్రవరి 28న ప్రపంచానికి అంకితం చేశాడు. దీంతో ఆ రోజును దర్జీ కళా దినోత్సవం (టైలర్స్ డే)గా జరుపుకుంటున్నాం. ఒకనాడు ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన దర్జీ నేడు ఆదరణ లేక వృత్తిని చేపట్టేవారు కరువవుతున్నారు. నాడు హిందూ, ముస్లిం, క్రైస్తవుల పండుగలు వచ్చాయంటే దర్జీలకు బట్టలు కుట్టించుకునేవారు. పండగల సీజన్లో దర్జీలకు భలే గిరాకీ ఉండేది. రాత్రి, పగలు పని చేసినా బట్టలు కుట్టి ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం రెడీమేడ్ దుస్తులు సరిపోనీ వాళ్ళు మాత్రమే దర్జీల వద్ద కుట్టించుకుంటున్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 4 వేల మంది టైలర్లు ఉన్నారు. కర్నూలు నగరంలోనే సుమారు 2 వేల మంది టైలర్లు ఆ వృత్తి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో టైలర్లకు నెలకు రూ.20 వేల వరకూ ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ.10 వేలు కూడా రావడం లేదు. దీంతో టైలర్ల కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేసి ఆదుకోవాలని టైలర్లు కోరుతున్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క దర్జీకి పెన్షన్లను మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

40 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలి



టైలర్లకు 40 సంవత్సరాలకే పెన్షన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలి. మా తండ్రి నూర్ అహ్మద్ మోడ్రన్ ట్రైలర్ వద్ద టైలరింగ్ నేర్చుకున్నా. 1991లో షాప్ పెట్టాను. అప్పట్లో ఎనిమిది మంది పనిచేసేవారు. రెడీమేడ్ దుస్తులు రావడంతో బట్టలు కుట్టించేవారు తగ్గిపోయారు. ప్రస్తుతం ఇద్దరు పని చేస్తున్నారు. టైలర్స్‌కు వెల్ఫేర్ బోర్డు తరపున సబ్సిడీ లోన్లు ఇచ్చే ఏర్పాటు చేయాలి. ట్రైలర్లకు కంటి చూపు మందగిస్తుంది. నడుము నొప్పులు కాళ్ల నొప్పులు వస్తాయి. కావున వీరికి హెల్త్ కార్డులు ఇచ్చి ఆరోగ్య సమస్యలకు ఉచితంగా ప్రభుత్వమే వైద్యం చేయించాలి. అన్ని ఖర్చులు పెరిగిపోయి విద్యుత్ ఛార్జీలు పెరిగిపోవడంతో ఇల్లు గడవడానికి మాత్రమే వచ్చే డబ్బులు సరిపోతున్నాయి. రాబోవు కాలంలో టైలర్లు కనుమరుగయ్యే పరిస్థితి ఉంది.

- ఎస్.ఖలీల్ బాషా, టైలర్స్ అసోసియేషన్ స్టేట్ ఆర్గనైజింగ్ అధ్యక్షులు.

స్వయం ఉపాధితో బతుకుతున్నాం



టైలరింగ్ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రస్తుతం షాప్ రెంటు ఐదు వేలు. గతంలో ఒక్కొక్క షర్టుకు రూ.నాలుగు, ప్యాంటుకు రూ.16 మెటీరియల్ ఖర్చు వచ్చేది. నేడు అలాంటి పరిస్థితి లేదు. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. టైలరింగ్ పని తగ్గిపోవడంతో స్వయంగా రెండు లక్షల వరకు రెండు రూపాయల వడ్డీకి తెచ్చుకొని బెంగళూరుకు వెళ్లి కాటన్, లెనిన్ లాంటి బట్టలు తెచ్చి స్నేహితుల సహకారంతో బట్టతో పాటు కుట్టి ఇచ్చేందుకు రూ.1600 తీసుకుంటున్నాను. షాపు బాడుగ కరెంట్ బిల్లు వడ్డీలు తమ కింద పనిచేసే వారికి కూలీలు ఇచ్చి మిగిలింది తీసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

- పాపన్న, టైలర్.

సీజన్‌లో మాత్రమే గిరాకీ



మార్కెట్‌లో రెడీమేడ్, ఆన్‌లైన్ దుస్తులు వచ్చిన తర్వాత బట్టలు తెచ్చి కుట్టించుకునే రోజులు తగ్గిపోయాయి. దీంతో సీజన్‌లో మాత్రమే గిరాకీ ఉంటుంది. 1983లో మున్సిపల్ షాపులో రూ.50 బాడుగతో ప్రారంభించి నేడు రూ.6,200 చెల్లిస్తున్నాను. గతంలో 15 మంది దాకా పనిచేసే వారు ఇప్పుడు 8 మంది మాత్రమే పనిచేస్తున్నారు.

- అరిస్టో టైలర్ బి.సాయి బాబా.

బోడబండలో శివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలి మండల పరిధిలోని ఉప్పర్లపల్లె గ్రామ సమీపాన గల బోడబండ పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ పకీరప్ప గురుస్వామిలు శ్రీ యల్లప్ప గురు స్వాములు శ్రీ ఆంజనేయులు తాత వారి మహాశివరాత్రి ఉత్సవ వేడుకలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అప్ప వేణు, తిమ్మ గురుడు దేవాలయం ధర్మకర్త సుదర్శన్ రెడ్డి, పాల్గొన్నారు. శ్రీ పకీరప్ప స్వామి, శ్రీ యల్లప్ప స్వామి, శ్రీ ఆంజనేయులు తాత ఉత్సవమూర్తులకు అప్ప నారాయణస్వామి ఆధ్వర్యంలో గంగా స్నానం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రథోత్సవం నిర్వహించారు. శుక్రవారం స్వామివారి హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ ధర్మకర్త అప్ప వేణు తెలిపారు.

పద్య నాటకానికి సురభి ప్రాణం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

సురభి సమాజాలు పద్య నాటకానికి ప్రాణం పోశాయని టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. గురువారం రాత్రి రెండో రోజూ సురభి సాయి సంతోష్ నాట్య మండలి వారు పాతాళ భైరవి జానపద పద్య నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసిన సురభి కళాకారులు కొండలరావు, వెంగమాంబ, హారికను ఆయన సన్మానించారు. కళాసమితి మాజీ అధ్యక్షులు పి.దస్తగిరి, వివి.రమణారెడ్డి, జివి.శ్రీనివాసరెడ్డి, సంఘ ఆంజనేయులు, లక్ష్మీకాంతరావు, పాండు రంగయ్య ఉన్నారు. పాతాళభైరవి నాటకంలో తోటరామునిగా కార్తీక్, అంజి, సురభి వెంకటేష్, మాంత్రికునిగా సురభి నిరంజన్ వాణిగా మాలక్ష్మి, నాయక పాత్ర హిందూమతిగా సురభి హారిక, పాతాళ భైరవిగా సురభి వెంగమాంబ, నటించగా సురభి సంతోష్ కొండలరావు సంగీతాన్ని అందించారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి సమీపంలోని బ్రహ్మగుండ క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ సమయంలో 12.10 గంటలకు కామేశ్వరి సహిత బ్రహ్మేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాల నడుమ కనుల పండువగా సాగింది. కల్యాణోత్సవానికి మండల ప్రజలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నేడు బ్రహ్మేశ్వర స్వామి రథోత్సవం : శ్రీబ్రహ్మేశ్వర స్వామి వారు గంగాదేవి, గౌరీ దేవి ఉత్సవ మూర్తులతో సాయంత్రం 5.25 గంటలకు రథోత్సవం ప్రారంభం కానుంది. వెల్దుర్తి గ్రామ పెద్దలు, ఆలయ అధికారుల సమక్షంలో రథోత్సవం నిర్వహిస్తారు.

కొత్త కూలి రేట్ల జిఒ విడుదల చేయాలి

- సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ
- ఏడో రోజూ నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సివిల్ సప్లై హమాలీలకు 14 నెలలు అయినా పెరిగిన కూలి రేట్లు ఇవ్వకుండా కాల యాపన చేస్తున్న ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని, కొత్త కూలీ రేట్ల జీవో విడుదల చేసే వరకు పోరాటం ఆపేది లేదని సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కృష్ణ, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కే రామకృష్ణ హెచ్చరించారు. గురువారం ఏడవ రోజు కర్నూల్ నగరంలోని ఏ క్యాంపు దగ్గర ఉండే సివిల్ సప్లై ఎంఎల్ఎస్ పాయింటు దగ్గర పి.సోల్మాన్ రాజు అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ హమాలీల పెంచిన కొత్త కూలిరేట్లకు సంబంధించిన జీవోను వెంటనే విడుదల చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై హమాలీ కార్మికులతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్ ముగిసిపోయి 14 నెలలు అవుతోందని, వారికి పెరిగిన ధరల కనుగుణంగా జీవోను విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. రెండు సంవత్సరాలకోసారి అగ్రిమెంటు ప్రకారం పెరిగినా కూడా నామినల్‌గా పెంచుతున్నారని, మూడు నుండి ఐదు రూపాయల వరకు మాత్రమే పెంచుతున్నారని తెలిపారు. ఇది కార్మికులకు సరిపోవడం లేదు ఇప్పుడు ఉన్నటువంటి రేట్ల ప్రకారం చూసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై హమాలీలకు 30 రూపాయల నుండి 40 రూపాయల వరకు పెంచి ఇస్తే తప్ప వారి యొక్క జీవనం సాగదన్నారు. సివిల్ సప్లై హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. బోనస్, స్వీట్స్, కుట్టుకూలితో పాటు పెంచి ఇవ్వాలని చెప్పారు. హమాలీల సమస్యలను పరిష్కరించకపోతే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి బజారి, ఆర్ చంద్ర, కర్నూల్ ఎంఎల్ఎస్ పాయింట్ కార్మికులు శివ, వినయ్, ప్రకాష్, రమేష్, శ్రీను, ఎం రాజు, వెంకటేష్, బాలరాజు, మహేంద్ర, డి.సూరి, మద్దిలేటి పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న నాయకులు

అన్నదాన సత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

శ్రీశైలంలోని శ్రీఅఖిల భారత కురువ వంశ నిత్యాన్నదాన సత్రం కమిటీ ఆధ్వర్యంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 23 నుంచి భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, ఉమ్మడి జిల్లాల గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, డైరెక్టర్ యుగంధర్ సత్రంను సందర్శించి, భక్తులకు భోజనాలను వడ్డించారు. గురువారం ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడారు. సత్రంలో 5 రోజుల పాటు అన్నదానం నిర్వహించిన సత్రం కమిటి వారిని అభినందించారు. భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను, సత్రం లో ఉన్న భక్తులను చూసి సంతోషించారు. సత్రంలో తలముడిపి కురువ మల్లయ్య, పర్ల మల్లికార్జున, చిన్న నాగన్న, నీలన్న, లడ్డు రామన్న అన్నదానానికి సహకరించారు. సత్రం కమిటి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తు సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. సత్రం కమిటీ అధ్యక్షులు ఎంకె.రంగస్వామి, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, కె.మహేశ్వర్, కోశాధికారి కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రీసర్వే తనిఖీ

ప్రజాశక్తి - మద్దికెర

మండలంలోని పెరవలి గ్రామంలో రెవెన్యూ సిబ్బంది చేపట్టిన రీసర్వేను గురువారం జెసి డాక్టర్ బి.నవ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతుల ఆస్తి పత్రాల ద్వారా వారి భాగస్వామ్యంతో రీ సర్వే సక్రమంగా చేయాలన్నారు. రైతులకు సమస్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు, సూచనలు ఇచ్చారు. అనంతరం బొమ్మనపల్లిలో ఉన్న ప్రభుత్వ భూమి రికార్డులను పరిశీలించారు. సర్పంచి ఆంజనేయులు, పత్తికొండ ఆర్‌డిఒ భరత నాయక్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న జెసి నవ్య

తాగునీటి కొరత లేకుండా చర్యలు : వీసీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

హాస్టల్‌లో విద్యార్థులకు తాగునీటి కొరత లేకుండా చూడాలని వర్సిటీ వైస్ ఛాన్సిలర్ వి.వెంకట బసవరావు వర్సిటీ ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం రాయలసీమ వర్సిటీలోని హాస్టల్స్‌ను వీసీ వి.వెంకట బసవ రావు, రెక్టార్ ఎన్‌టికె.నాయక్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హాస్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు.

ఎల్ఎల్‌బి రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

వర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బి-3, 5 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు సంబంధించిన 1, 3, 5, 7, 9 సెమిస్టర్ ఫలితాలను వీసీ వి.వెంకట బసవరావు విడుదల చేశారు.

ఎర్రగుడిలో బండలాగుడు, కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

శ్రీరామలింగేశ్వర స్వామి మహా శివరాత్రి సందర్భంగా చుంచు ఎర్రగుడి గ్రామంలో బండలాగుడు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. గురువారం ఈ పోటీలను ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్, టిడిపి జిల్లా పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆలంకొండ షేక్ నబి సాహెబ్, టిడిపి నాయకులు ఎన్ఇ.ప్రకాష్ గౌడ్, పుల్లప్ప, మాజీ సర్పంచి చిన్న మద్దిలేటి, శేఖర్ గౌడ్, మాజీ ఎంపిటిసి కత్తి నాగేష్, బట్టే వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. బండలాగుడు పోటీలకు మొదటి బహుమతి రూ.40,116, రెండో బహుమతి రూ.30,116, మూడో బహుమతి రూ.20,116, నాలుగో బహుమతి రూ.10,116, ఐదో బహుమతి రూ.5,116 అందజేశారు. బహుమతులను దాతలు ఇవి.శేఖర్ గౌడ్, ఆయన భార్య మాధవి, ఎన్ఇ.జగన్మోహన్ గౌడ్, ఆయన భార్య లక్ష్మీదేవి, కుమారుడు మణిధర్ గౌడ్, ఆయన భార్య భారతి బహుమతులు అందజేశారు. అనంతరం కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి దాతలు కత్తి బుడ్డ రాముడు కుమారులు కత్తి గోవిందు, కత్తి బొట్ట వెంకటేష్, కత్తి కేసన్న, కత్తి శ్రీనివాసులు, కత్తి బాల వెంకటరమణ రూ. 20 వేలు, రెండో బహుమతి దాతలు గొంగళ్ల బాలమద్దయ్య, తిమ్మన్న రూ.15 వేలు, మూడో బహుమతి దాత ఎరుకల చెరువు చంద్రప్ప గారి సుఖాలీ సన్స్ రూ.10 వేలు, నాలుగో బహుమతి దాత రేగులపాడు కత్తి రమణ, కత్తి శ్రీనివాసులు రూ.5 వేలు, కబడ్డీ మ్యాట్ దాత ఇవి.శేఖర్ గౌడ్ ఏర్పాటు చేశారు. అనంతరం మహారాత్రి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు లడ్డు, పాయసం దాత మాజీ ఎంపిటిసి కత్తి నగేష్ ఏర్పాటు చేశారు. మాజీ జడ్‌పిటిసి కిష్టప్ప, మాజీ సర్పంచి రామాంజనేయులు, రేగులపాడు శ్రీరాములు, వెంకటేష్, రామకృష్ణ, జయన్న, టిడిపి చుంచు ఎర్రగుడి నాయకులు గొంగళ్ల మద్దయ్య, బాలు, రంగస్వామి, శేఖర్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కెఇ

రైతుల అనుమతి లేకుండా

విద్యుత్ స్తంభాలు వేస్తే ఊరుకోం : సిఐటియు

ప్రజాశక్తి-గూడూరు

గూడూరులో రైతుల అనుమతి లేకుండా పంట పొలాల్లో గ్రీన్ కో ఎనర్జీ, ఎవరీ వన్ ప్రయివేట్ కంపెనీలు విద్యుత్ స్తంభాలు వేస్తే ఊరుకునేది లేదని సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ హెచ్చరించారు. గురువారం రైతులతో కలిసి తహశీల్దార్ రామాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. మోహన్ మాట్లాడుతూ... పట్టణంలో గాలి మరల ఫ్యాన్లు ఏర్పాటు చేశారని, వాటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి విద్యుత్తును తరలించడానికి గ్రీన్ కో ఎనర్జీ, ఎవరీ ప్రైవేట్ కంపెనీలు విద్యుత్తు స్తంభాలు వేస్తున్నారని తెలిపారు. కొంతమంది రైతుల అనుమతితో పొలాల్లో నష్టపరిహారం తీసుకొని విద్యుత్ స్తంభాలు వేయించుకుంటున్నారని, మరి కొంతమంది అనుమతి లేకుండా పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేస్తున్నారని చెప్పారు. మరోపక్క ప్రయివేట్ కంపెనీ వారు గోకారి సర్వే నెంబర్ 35, ఆలీ బాషా సర్వేనెంబర్ 25, మాసుం సర్వేనెంబర్ 25 గల వ్యక్తుల పొలాల్లో మూడు చోట్ల విద్యుత్ స్తంభాలు వేశారని తెలిపారు. ప్రైవేట్ కంపెనీ వారు రైతుల అనుమతి లేకుండా వేసిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించకపోతే రైతులతో కలిసి మేమే విద్యుత్ స్తంభాలను తొలగిస్తామని హెచ్చరించారు. విచారణ చేసి న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

'హమాలీల సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి - పత్తికొండ


సివిల్ సప్లయి హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సివిల్ సప్లయిస్ యూనియన్ మండల కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు మండల కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో సివిల్ సప్లయి హమాలీలు పట్టణంలోని ఈశ్వర్ రెడ్డి భవనం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. ముఖ్యఅతిథిగా సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, సివిల్ సప్లయి మండల కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. 14 నెలల బకాయిలను విడుదల చేయాలని, పెంచిన వేతనాల జిఒను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం హమాలీలు ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల నాయకులు దస్తగిరి, సివిల్ సప్లయి మండల అధ్యక్షులు హుస్సేన్, హమాలీలు సురేంద్ర, పెద్ద హుస్సేని, కేశవులు, రాము, లక్ష్మయ్య, మల్లికార్జున, రాము, రంగయ్య పాల్గొన్నారు.

భూములను కాపాడండి

- తహశీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని చింత మానుపల్లిలో గల వసంతప్ప గుడి భూములను కాపాడాలని గ్రామస్తులు కోరారు. గురువారం తహశీల్దార్ పురుషోత్తంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుడికి సుమారు 60 ఎకరాల భూమి ఉందని చెప్పారు. గుడికి చెందిన భూమి సుమారు 14 ఎకరాలను ఆలయ నిర్వాహకులు బోయ పెద్ద రాఘవన్న, బోయ చిన్న రాఘవన్న, బోయ కృష్ణ మూర్తి, బోయ వెంకటేష్, బోయ మంత్రికారి రాముడు, బోయ రంగన్నలు దొడ్డి దారిలో ఆన్‌లైన్ చేసుకున్నట్లు తెలిపారు. సర్వే నెంబర్ 70లో ఉన్న 13 ఎకరాల 87 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేసుకున్నట్లు చెప్పారు. వీరంతా దాయాదులేనని, ఏటా ఒక కుటుంబం వసంతప్ప గుడి ఆలనపాలన చూస్తూ వచ్చే వనరులను అనుభవిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం భూముల విలువ రూ.కోట్లలో ఉందని, వారి ఆన్‌లైన్ తొలగించి వారి చెర నుంచి కాపాడాలని కోరారు.



ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, నాయకులు

మంత్రి లోకేష్ పర్యటన ఖరారు

- ఏర్పాట్లు పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో జరగనున్న శ్రీగురు వైభవోత్సవాలకు హాజరయ్యేందుకు రాష్ట్ర విద్యాశాఖ, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన ఖరారయింది. మార్చి 1 నుంచి 6 వరకు రాఘవేంద్రస్వామి గురువైభోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 1న మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, యువ నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, తహశీల్దార్ ఎస్.రవి, సిఐ రామాంజులు తదితరులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రాలయం చేరుకున్న వారు స్థానిక హెలిప్యాడ్, వసతి గృహాలు, శ్రీమఠం పరిసరాలను పరిశీలించారు. లోకేష్ శనివారం తాడేపల్లి నుంచి హెలిక్యాప్టర్ ద్వారా ఉదయం 9.30 గంటల మంత్రాలయం చేరుకొని, రాఘవేంద్రస్వామిని దర్శించుకుంటారు. అనంతరం రాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్తి అవార్డులు పీఠాధిపతులు చేతుల మీదుగా అందుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తాడేపల్లికి హెలిక్యాప్టర్‌లో తిరిగి బయల్దేరారు. మంత్రి పర్యటనకు ఎలాంటి ఆటంకాలూ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండల సర్వేయర్ అశోక్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

- సిటీ మార్కెటింగ్ మేనేజర్ జిలాన్ బాషా

ప్రజాశక్తి - ఆదోని



శిక్షణ ఇస్తున్న అధికారులు

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని సిటీ మార్కెటింగ్ మేనేజర్ జిలాన్ బాషా తెలిపారు. గురువారం సర్వీస్ ప్రొవైడర్లకు వ్యాపారాభివృద్ధి శిక్షణ కార్యక్రమం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), నైపుణ్యాభివృద్ధి శిక్షణ (ఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని పట్టణంలో సర్వీస్ ప్రొవైడర్లకు సంబంధించిన ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్ కోర్సులో ఎవరైనా మహిళలకు వారం నుంచి శ్రీవిద్య స్కూల్ దగ్గర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, చంద్రశేఖర్ హాస్పిటల్ పక్కన, సాయి బాబా నగర్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసి సర్టిఫికేషన్ పొందిన వారు హోమ్ ట్రయాంగిల్ ప్లాట్ ఫారం ద్వారా అర్బన్ కంపెనీ ద్వారా జీవనోపాధి కల్పిస్తామని తెలిపారు. నైపుణ్యంతో స్వంత ప్రాంతంలో సేవలందించి చక్కటి ఆదాయాన్ని పొందడానికి ఇది మంచి అవకాశమని చెప్పారు. హోమ్ ట్రయాంగిల్ సంస్థ వారు శిక్షణకు హాజరైన సర్వీస్ ప్రొవైడర్లకు హోమ్ ట్రయాంగిల్ ప్లాట్ ఫారంలో ఆన్ బోర్డు చేసినట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. కళాశాల ప్రిన్సిపల్ కె.సుధాకర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 800 మంది విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ కరణం ఇందు మైత్రి (ఆయుర్వేద), డాక్టర్ కె.అవర్ణ (హోమియోపతి అండ్ కాస్మోటాలజిస్ట్), డాక్టర్ విజయ భారతి, (న్యాచురోపతి అండ్ యోగా), డాక్టర్ హర్ష (డెంటల్) పాల్గొన్నారు. వైద్యులు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుధాకర్ మాట్లాడారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన కళాశాల నిర్వహణ, వైద్య బృందం, సహాయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన పెంచుకున్నారు. వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు నసీమ, మెర్సి స్వరూప పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సమస్యల కూత

- తాగునీరు, మురుగుదొడ్ల వసతి కరువు - నీడనిచ్చే షెడ్లు లేవు

ప్రజాశక్తి - కోసిగి

కోసిగి రైల్వే స్టేషన్‌లో అడుగడుగునా సమస్యలే.. స్టేషన్‌లో తాగేందుకు నీరు, వాడుకునేందుకు మురుగుదొడ్లు కరువయ్యాయి. వేసవి, వర్షాకాలంలో ప్రయాణికులకు నీడనిచ్చేందుకు షెడ్లు కూడా లేవు. రాత్రి సమయంలో వచ్చే ప్రయాణికులకు స్టేషన్‌లో భద్రత కరువైంది. సమస్యలను ఉన్నతాధికారులకు, శాఖాధికారులకు విన్నవించినా పరిష్కరించడం లేదని ప్రయాణికులు, గ్రామస్తులు మండిపడుతున్నారు.

కోసిగి రైల్వే స్టేషన్ మీదుగా ప్రధానంగా ముంబయి, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలకు వెళ్లేందుకు పదుల సంఖ్యలో రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. కోసిగి రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం చెన్నై టు ముంబయి, బెంగుళూరు టు నాందేడ్, రాయచూర్ టు గుంతకల్లు వంటి రైళ్లు ఆగుతున్నాయి. స్టేషన్ నుంచి రోజూ వందలాదిమంది గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.



మూతపడిన శౌచాలయాలు



నిరుపయోగంగా ఉన్న తాగునీటి కుళాయి

రైల్వేస్టేషన్‌లో తాగునీరు, మురుగుదొడ్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. అలాగే వేసవి, వర్షాకాలం వస్తే నీడనిచ్చేందుకు షెడ్లు కూడా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో వచ్చే ప్రయాణికులకు భద్రత సైతం కరువైంది. రైలు టికెట్లు తీసుకున్న ప్రతి ప్రయాణికునికీ సౌకర్యాలు కల్పించడం రైల్వే శాఖ బాధ్యత... దేశంలో ప్రధాన శాఖ అయిన రైల్వేలో సమస్యలు కోకొల్లలు. ఇతర ప్రదేశాలకు వెళ్లేవారు రైల్వే స్టేషన్‌లో ద్విచక్ర వాహనాలు, కార్లు ఆపడం సహజం. కోసిగి రైల్వే స్టేషన్‌లో దాదాపు 10 నుంచి 20 ద్విచక్రవాహనాల దొంగతనాలు జరిగాయి. ఇంతవరకు ఏ ఒక్క ద్విచక్ర వాహనం కూడా రికవరీ కాకపోవడం కొసమెరుపు. ఉన్నతాధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు పలుమార్లు రైల్వే స్టేషన్‌లో తనిఖీలకు వచ్చినప్పుడు స్థానికంగా ఉన్న సమస్యలను గ్రామ పెద్దలు, యువకులు, ప్రజాసంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఇంతవరకు ఏ ఒక్క సమస్య పరిష్కారం కాకపోవడంపై రైల్వే శాఖాధికారులపై గ్రామస్తులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోసిగి రైల్వే స్టేషన్‌లో గతంలో కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్, గుల్బర్గా ప్యాసింజర్లు నిలిపేవారు. గత కొంతకాలంగా ఈ రెండు రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే శాఖాధికారులు స్పందించి ఈ రైళ్లను పునః ప్రారంభించాలని, స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలతో పాటు అన్ని సౌకర్యాలూ కల్పించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించాలి

గోపాల్, ప్రయాణికుడు, కోసిగి



కోసిగి రైల్వేస్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు చాలామంది ప్రయాణికులు వెళ్తుంటారు. గతంలో కొల్హాపూర్, గుల్బర్గా ఎక్స్‌ప్రెస్ రైళ్లు కోసిగి రైల్వే స్టేషన్‌లో ఆగేవి. కొన్ని రోజుల నుంచి ఆ రైళ్లు ఆగడం లేదు. రైల్వే శాఖాధికారులు స్పందించి కొల్హాపూర్, గుల్బర్గా ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించాలి.

ఎంపిడిఒ సుబ్బరాజు సేవలు మరువరానివి

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం ఎంపిడిఒ సుబ్బరాజు సేవలు మరువరానివని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో విరమణ పొందుతున్న ఎంపిడిఒ సుబ్బరాజును శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో ఎంపిడిఒ సుబ్బరాజు కృషి ఎంతో ఉందన్నారు. మండల ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండి సహాయ, సహకారాలు అందించారని తెలిపారు. అధికారులకు విరమణ సర్వ సాధారణమన్నారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. టిడిపి నాయకులు కృష్ణ, మూకన్న, అమ్ము వలీ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



సుబ్బరాజును సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా మస్తాన్ వలీ స్వామి ఉరుసు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నంచర్ల గ్రామంలో మస్తాన్ వలీ స్వామి 39వ ఉరుసు దర్గా పెద్దలు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం వేకువజామునే దివానే మస్తాన్ వలీ స్వామి ప్రతిమను అశ్వ వాహనంపై ప్రతిష్ఠించి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. పెద్ద ఎత్తున మహిళలు స్వామి వారిని దర్శించుకుని కాయకూర్పురం అర్పించారు. గ్రామంలో ఉరుసు సందర్భంగా పండగ వాతావరణం నెలకొంది.



అశ్వానికి పూజలు చేస్తున్న మహిళలు

వైభవంగా శ్రీరామలింగేశ్వరుని రథోత్సవం

- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ హాజరు

ప్రజాశక్తి - నందవరం

మహాశివరాత్రి సందర్భంగా నందవరం మండలం గురజాల గ్రామంలో శ్రీరామలింగేశ్వర స్వామి రథోత్సవం గురువారం వైభవంగా సాగింది. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పూలతో అందగా ముస్తాబు చేసిన రథంలో రామలింగేశ్వర స్వామిని ప్రతిష్ఠించి ఊరేగించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్ని వసతులూ కల్పించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఇంటర్వ్యూలకు 90 శాతం హాజరు

- టిపిఆర్ఒ శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

స్వయం ఉపాధి యూనిట్లే నెలకొల్పేందుకు బ్యాంకు రుణం కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 90 శాతం మంది దరఖాస్తుదారులు హాజరయ్యారని టిపిఆర్ఒ శ్రీనివాసులు తెలిపారు. గురువారం రెండో రోజూ దరఖాస్తుదారులకు బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిఆర్ఒ శ్రీనివాసులు మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 98 యూనిట్లకు గాను 2,575 మంది బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మంగళ, గురువారాలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 2,346 మంది దరఖాస్తుదారులు హాజరు అయ్యారని చెప్పారు. ముందుగానే అందరికీ సమాచారం ఇచ్చామని తెలిపారు. బ్యాంకు ఖాతా లేని వారు కూడా ఇంటర్వ్యూలో పాల్గొనేందుకు అవకాశం కల్పించామని చెప్పారు. బ్యాంకులవారీగా ఇంటర్వ్యూలు నిర్వహించామని, పారదర్శకంగానే రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. దళారుల మాటలు వినొద్దని కోరారు. మెప్మా సిటీ మార్కెటింగ్ మేనేజర్ జిలాన్, బ్యాంకు మేనేజర్లు, ఉద్యోగులు చంద్ర, రవి, శ్రీనివాసులు, నాగరాజు, యశోద కృష్ణ, చంద్రశేఖర్, హనుమంతయ్య, వేణుగోపాల్, మెప్మా సిఒ జావీద్ ఉన్నారు.

యూనిట్లు పెంచాలి : బ్యాంకు రుణం కోసం నిరుద్యోగులు చాలామంది దరఖాస్తు చేసుకున్నారని, యూనిట్లు పెంచాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలో అధికారులతో మాట్లాడారు. ఆదోని అర్బన్‌లో 98 యూనిట్లకుగాను సుమారు 2,600 మంది, రూరల్‌లో 60 యూనిట్లకు గాను 700 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇంత తీవ్రమైన పోటీ ఉందని, ప్రభుత్వం గ్రహించి కనీసం 500 యూనిట్లకు పెంచి కొందరికైనా రుణాలు మంజూరయ్యేలా చూడాలని కోరారు.



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సిఐ

నాటుసారా సమూల నిర్మూలన

- ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పరిసరాల్లో నాటుసారా తయారీ, విక్రయాలను సమూలంగా నిర్మూలిద్దామని, ప్రజలు సహకరించాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలిపారు. గురువారం పట్టణ శివారు రణ మండల కొండల్లో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. నాటు సారాపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, నవోదయం 2.0లో భాగంగా ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రణమండల కొండల్లో 345 లీటర్ల ఘాటైన బెల్లం ఊటను ధ్వంసం చేసి 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరో కేసులో 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదోనిలోని వాల్మీకి నగర్‌కు చెందిన బోయ లాలుస్వామి, బోయ రవిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నాటసారా తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారి వివరాలు తెలిస్తే తమకు 94409 02578 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అశేష జనవాహిని మధ్య రథోత్సవం

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని కుందనగుర్తి గ్రామంలో వెలసిన శివలింగ రూఢా స్వామి రథోత్సవం అశేష జనవాహిని మధ్య వైభవంగా సాగింది. గురువారం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచి కొండా పురుషోత్తం, గ్రామస్తుల ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రీతి పాత్రమైన పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజులుగా అన్నదానం నిర్వహించారు. కొండపై ఉన్న స్వామివారి ఆలయం విద్యుత్ దీప కాంతులతో ధగధగ వెలిగిపోయేలా అలంకరించారు. అనంతరం సాయంత్రం స్వామివార్ల ప్రతిమలను రథోత్సవంలో ప్రతిష్ఠించి అశేష జన వాహిని మధ్య లాగారు. స్వామివారి రథోత్సవం చూడడానికి గ్రామంలోని ప్రజలు, మహిళలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.



రథోత్సవం లాగుతున్న భక్తులు, ప్రజలు

వర్సిటీలోనే సర్టిఫికెట్లు పరిశీలించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రతి విద్యా సంవత్సరానికీ యూనివర్సిటీ గుర్తింపునకు ప్రారంభమయ్యే సర్టిఫికెట్ పరిశీలనను యూనివర్సిటీలోనే నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రాయలసీమ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన వర్సిటీలో మాట్లాడారు. యూనివర్సిటీలో నిర్వహించకుండా గతంలో ఉన్న అధికారులతో కళాశాల యాజమాన్యాలు కుమ్మక్కై నిబంధనలు బేఖాతరు చేశాయని తెలిపారు. వెంటనే యూనివర్సిటీ అధికారులు బిఎడ్ కళాశాలల సర్టిఫికెట్ పరిశీలనను యూనివర్సిటీ లోనే జరిపించాలని డిమాండ్ చేశారు. లేకపోతే యూనివర్సిటీ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. యూనివర్సిటీ కోకన్వీనర్ మౌలాలి, సాగర్ యాదవ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడేషన్ మూడు నెలలు పొడిగింపు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలలు పాటు పొడిగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేసినట్లు కర్నూలు సమాచార శాఖ డిఐపిఆర్ఒ జయమ్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఫిబ్రవరి 28 నాటికి అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి వాలిడిటీ కలిగి పని చేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మార్చి 1, 2025 నుంచి మే 31 వరకు పొడిగింపు సౌకర్యం ఉంటుందని తెలిపారు.

1న పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


కర్నూలు ప్రభుత్వ పురుషుల కళాశాల పూర్వ విద్యార్థుల ప్రత్యేక సమావేశం మార్చి 1న కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.జయరాజు, ఆచార్య మన్సూర్ రహమాన్, విద్యార్థుల కమిటీ కన్వీనర్ డాక్టర్ కెజి.మల్లికార్జున, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. క్లస్టర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డివిఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పాల్గొననున్నట్లు తెలిపారు. కళాశాల అభివృద్ధి, విద్యాసంబంధిత విషయాలు, ప్రస్తుత పరిస్థితుల్లో తాము నిర్వహించే పాత్ర గురించి చర్చించనున్నట్లు చెప్పారు. 55 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో వివిధ రంగాల్లో అనేకమంది నిపుణులను, మేధావులను అందించిన ప్రభుత్వ పురుషుల కళాశాల సర్వతోముఖాభివృద్ధికి సహకారం, సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ బొజ్జమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో గుడిసె పూర్తిగా కాలిపోయి సర్వం కోల్పోయిన బోయ ఉచ్చీరప్ప కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ తెలిపారు. ఈనెల 20న విద్యుదాఘాతంతో గుడిసె కాలిపోయిన ఉచ్చీరప్ప కుటుంబాన్ని గురువారం పరామర్శించి రూ.5 వేలు, బియ్యం బస్తా అందజేసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గుడిసె పూర్తిగా కలిపోవడం బాధాకరమన్నారు. అధికారులతో మాట్లాడి ఇల్లు మంజూరు చేయిస్తామన్నారు. ప్రభుత్వం వలసలు నివారించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ చట్టాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయని, ప్రజలు వలసలు వెళ్లకుండా గ్రామంలోనే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోజుకు రూ.300 కూలి పడుతోందని తెలిపారు. గ్రామాల్లో పనులు కల్పించకపోతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తే పనులు కల్పిస్తారని చెప్పారు. టిడిపి నాయకులు కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బొజ్జమ్మ

4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి : కెజిబిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కెజిబిఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో శ్మశానంలో కాటికాపరులుగా ఉంటూ బతుకు సాగిస్తున్న బేగరులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి, వయస్సు నిండిన వారందరికీ రూ.8 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గడ్డపార, రెండు సలికలు, రెండు గంపలు, బూట్లు, డ్రస్సు ఇవ్వాలని తెలిపారు. బీమా సౌకర్యం కల్పించి, వృత్తిదారుల పిల్లలకు ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్యనందించాలని కోరారు. వృత్తిదారులందరికీ రెండెకరాల భూమి ఇవ్వాలని, గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని తెలిపారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈనెల 28న కర్నూలులో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాటికాపరుల సమస్యలపై మార్చి 11న చలో విజయవాడ చేపడతామని చెప్పారు. కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.తిమ్మన్న, చర్మ కళాకారుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి సుమాల ఆంథోని, గుంటెప్ప, వినోద్ పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం ప్యాకెట్లను భారీగా స్వాధీనం చేసుకున్నట్లు సిఐ రామాంజులు తెలిపారు. గురువారం స్థానిక పరిమళ పెట్రోల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి ఈడిగ విజయకుమార్ గౌడ్, వెంకటగిరి గ్రామానికి చెందిన దూదేకుల షేక్షావలీ (టిఎస్ 04 ఎఫ్‌సి 2285) టయోటా ఎటిఓస్ కారులో 34 బాక్సులు (3,264 కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఒరిజినల్ ఛాయిస్, డీలక్స్ విస్కీ, టెట్రా ప్యాకెట్లు 90 మిల్లీలీటర్లు) ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. విజయకుమార్ గౌడ్ పరారీ కాగా డ్రైవర్ స్థానంలో ఉన్న షేక్షావలీని, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వీటి విలువ బహిరంగ మార్కెట్లో కారుతో పాటు సుమారు రూ.6.5 లక్షలు ఉంటుందని తెలిపారు. వాహనాల తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ ఎంవి.రమణ, పోలీసులు విజయ్ కుమార్, జమీర్ బాషా పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు భారీ స్పందన

- 325 మంది దరఖాస్తు - ఎంపిడిఒ శోభారాణి


ప్రజాశక్తి - మంత్రాలయం



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన బీసీ కార్పొరేషన్ రుణాలకు భారీగా స్పందన లభించింది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆరు బ్యాంకుల అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శోభారాణి మాట్లాడారు. మండలానికి బీసీ కార్పొరేషన్ ద్వారా 382 మందికి 50 శాతం రాయితీతో లబ్ధి చేకూర్చేందుకు షెడ్యూల్ విడుదల చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తులను పరిశీలించిన అధికారులు యూనిట్‌ను బట్టి రుణాలు మంజూరవుతాయని చెప్పారు. ఎస్‌బిఐ అధికారులు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మంత్రాలయం, తుంగభద్ర శాఖల అధికారులు, కెనరా బ్యాంకు, కర్ణాటక బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు హాజరయ్యారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి



నివాళు లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం


మంత్రాలయంలోని రామచంద్రనగర్ కాలనీలో ఉన్న టిడిపి కార్యకర్త మద్రి పౌలు బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్రరెడ్డి సోదరులు ఎన్.రఘునాథరెడ్డిలు గురువారం వేర్వేరుగా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి టిడిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించారు. టిడిపి నాయకులు వరదరాజులు, వట్టెప్పగారి నరసింహులు, ఏబు, అశోక్ రెడ్డి, సున్నం రామకృష్ణ ఉన్నారు.

కమనీయం.. ఆదిదంపతుల కల్యాణం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిణిగేరి గ్రామ కొండల్లో శ్రీగిరి క్షేత్రంలో పార్వతి, పరమేశ్వరుల కల్యాణం కమనీయంగా సాగింది. మహాశివరాత్రి సందర్భంగా మూడురోజుల పాటు జరిగే శ్రీపంచలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బిణిగేరి గ్రామ కొండల్లో శ్రీగిరి క్షేత్రంలో వెలసిన పంచలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు శ్రీనివాసనాయన, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో గురువారం పార్వతి, పరమేశ్వరుల కల్యాణం వేదపండితులు రాజుస్వామి, అనిల్ స్వామి, సంతోష్ స్వామి, బాలాజీ స్వామి, స్వాములు వేదమంత్రాల మధ్య నిర్వహించారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో జ్యోతిని వెలిగించారు. అనంతరం స్వామివారికి ఆలయంలో ఉదయం గంగపూజ, గురు బిడ్డలకు కంకణ ధారణ, రుద్రహోమం, పుష్పాభిషేకం, ఆకు పూజ, మహా మంగళహారతి నిర్వహించారు. గౌరవయ్యల పాలపూజ, మేష లగ్నంలో కామేశ్వరి, పరమేశ్వరుల కల్యాణం జరిగింది. మధ్యాహ్నం చిగిలి గ్రామానికి చెందిన నాగలింగయ్య స్వామి, శంకరయ్య స్వాముల వీరభద్రస్వామి వేషధారణ భక్తులు, చిన్నారులను ఆకట్టుకుంది. భక్తులతో గండా దీపం, అంబలి ప్రసాదం అందించారు. సాయంత్రం శివపార్వతులను పల్లకిలో కూర్చోపెట్టి గంధంతో నందికోల సేవ మధ్య బసవేశ్వరుని ఊరేగింపుగా శ్రీగిరి ప్రదక్షణలు నిర్వహించారు. ఈ గంధం ఉత్సవంలో శ్రీనివాస నాయన, రమాదేవి దంపతులను భక్తులు గంధంతో ముంచెత్తారు. రాత్రి స్వామి వారికి ఊయల సేవ, గొల్ల లక్ష్మన్న యాదవ్ చిగిలి వారి ఆధ్వర్యంలో పంచముఖ ముల నాటక ప్రదర్శన నిర్వహించారు. పార్వతి, పరమేశ్వరుల కల్యాణం తిలకించేందుకు చుట్టుపక్కల చిరుమాన్ దొడ్డి, చిగిలి, నగరూరు, హాలిగేరి, తంగరడోన, ఆస్పరి, శంకరబండ తదితర గ్రామాలతో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సర్పంచి వెంకటేష్, ఎంపిటిసి లక్ష్మీ, పెద్దలు భీమన్న, గురూజీ, నాగయ్య, వెంకటేష్, చిన్న రెడ్డి, వీరేష్, సుధా, నాగరాజు, తిక్కయ్య, రంగన్న, సూరి, మూకన్న, దాసు, రవిచంద్ర, ధర్మరాజు పాల్గొన్నారు.

దేవనకొండ మండలంలోని దేవనకొండ, పల్లెదొడ్డి, కోటకొండ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో పార్వతి, పరమేశ్వరుల కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సాగింది. శివాలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి. పార్వతి, పరమేశ్వరుల విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేసి, కల్యాణోత్సవం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మేళతాళాలతో పార్వతి, పరమేశ్వరుల విగ్రహాలను ఊరేగించారు. భక్తాదులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



ఆస్పరిలో పార్వతి, పరమేశ్వరుల కల్యాణం



పల్లెదొడ్డి (దేవనకొండ)లో